క్లుప్తంగా

పోలీసుస్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్నపత్రాలు



పోలీసుస్టేషన్‌లో ప్రశ్నపత్రాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పశ్నపత్రాల కట్టలను పరిశీలించి, బాక్సుల్లో స్థానిక పోలీసుస్టేషన్‌కు చేర్చారు. పరీక్షల చీఫ్, సూపరింటిండెంట్లు మునిసుబ్రమణ్యం, దయాకర్, డిపార్టుమెంట్ ఆఫీసర్ వెంకటరమణ, శ్రీనివాసులు భద్రపరిచారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ, బీ, పరీక్షలు జరుగుతుండగా ఏ కేంద్రంలో 201 మంది, బీ కేంద్రంలో 193 మంది, మొత్తం 394 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



ప్యాడ్‌లు అందజేస్తున్న మురుగేష్

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వన్స్ హెల్ప్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలోని 45 మంది పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్‌లు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వన్స్ హెల్ప్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు మెరుం మురుగేష్, పంచాయతీ కార్యదర్శి మునేంద్ర, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉష, బాబు, శేఖర్, రాజా, దీనదయాళ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఆర్పీకి ఆర్థికసాయం



ప్రమీలకు ఆర్థికసాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

కేవీబీపురం: మండలంలోని ఆర్.సదాశివపురం పరిధిలో సీఆర్పీగా పనిచేస్తున్న ప్రమీల అనే యువతి తండ్రి నాలుగురోజుల క్రితం మరణించారు. తండ్రి మరణంతో ఒంటరైన ప్రమీలకు మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అండగా నిలిచారు. ఆమె తండ్రి కర్మక్రియల నిర్వహణకు విరాళాల రూపంలో రూ.30,116 సేకరించారు. ఆ మొత్తాన్ని గురువారం ప్రమీలకు అందించి బాసటగా నిలిచారు. తమతో ఇన్నేళ్లుగా పనిచేస్తున్న మహిళ కష్టాల్లో ఉందని తెలిసి టీచర్లు తోడుగా నిలవడం విశేషం. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి రమేష్, దయాకర్, సుబ్రమణ్యం, బాబు, మావిళ్లయ్య, మధు, విజయభాస్కర్, రెజి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న రియాజ్

వరదయ్యపాళెం: మండలంలోని గోవర్ధనపురం, కారిపాకం హైస్కూళ్లకు చెందిన 75 మంది పదో తరగతి విద్యార్థులకు బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్స్ సంస్థచే ప్యాడ్లు, పెన్నులు వితరణగా అందజేశారు. గురువారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రియాజ్, స్థానిక ఇందిరానగర్ సర్పంచ్ వీరభద్రం చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గున్నయ్య, మారయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు ఉన్నారు.

సామగ్రి వితరణ



సామగ్రిని అందిస్తున్న సర్పంచ్ గోపాల్

కేవీబీపురం: మండలంలోని వగత్తూరు గ్రామ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలకు ఆ గ్రామ సర్పంచ్ గోపాల్ కుర్చీలతో పాటు అక్కడ చదివే సుమారు 70 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణగా అందించారు. స్కూల్‌కు కుర్చీలతో పాటు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను ఉపాధ్యాయుల సమక్షంలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఆర్ముగం, ఉపాధ్యాయులు సుందరం, చిరంజీవి పాల్గొన్నారు.

వేలంపాట రేపు

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ నగేషం, పంచాయతీ ఈఓ విజయభాస్కర్ గురువారం తెలిపారు. సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాప్ రుసుము వసూలు, పంచాయతీ రూముల వేలం పాట జరుగుతుందన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు నిర్ణీత ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని వారు కోరారు.

తెప్పోత్సవాలకు సర్వం సిద్ధం



క్యూలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



ఆలయంలో చలువ పందిళ్లు వేస్తున్న ఆలయ సిబ్బంది

– నేడు మత్స్యజయంతి

పిచ్చాటూరు: నాగలాపురంలో వెలసిన శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయం సూర్యపూజ తెప్పోత్సవాలకు ముస్తాబవుతోంది. టీటీడీ అధికారులు చలువ పందిళ్లు, క్యూలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుక్రవారం సూర్యపూజతో పాటు మత్స్యజయంతి ఒకేరోజు రావడం విశేషం. 24న ఉదయం మత్స్యజయంతిని పురస్కరించుకుని నెల్లూరు, ఒంగోలు జిల్లాల నుంచి 1,500 మంది మత్స్యకారులు ఇరుముళ్లతో ఆలయాని చేరుకుని స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు. అదేరోజు సాయంత్రం సూర్యపూజ ప్రారంభం కానుండడం విశేషం. ఈనెల 24 నుంచి 28 వరకు ఆలయంలో సూర్యపూజ తెప్పోత్సవాలు వేడుకగా జరగనుంది. ఈనెల 24 నుంచి 25 వరకు తెప్పోత్సవాలు, 26న సాయంత్రం సూర్యకిరణాలు ఆలయ మూల విరాట్ పాదాలను తాకుతుంది. అలాగే 27న స్వామివారి నాభిని, 28న సాయంత్రం శిరస్సుపై భాస్కరతేజం ప్రసరిస్తుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. మత్స్య జయంతి, సూర్య పూజకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గాడి తప్పుతున్న రెవెన్యూ పాలన

- ఒకరోజు కూడా కార్యాలయానికి రాని ఇన్‌చార్జ్ తహసీల్దార్



మూతపడిన తహసీల్దార్ గది

బుచ్చినాయుడుకండ్రిగ: గత రెండు నెలలుగా మండల రెవెన్యూ అధికారి లేకపోవడంతో మండలంలో పాలన కుంటుపడింది. దీంతో మండలంలోని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత జనవరిలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు, డిప్యూటీ కలెక్టరుగా పదోన్నతిపై చిత్తూరు ఫారెస్టు శాఖకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి సత్యవేడు తహసీల్దారు పీవీసుబ్రమణ్యం ఇన్‌చార్జ్ తహసీల్దారుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెండు నెలలుగా ఒక్కరోజు కూడా కార్యాలయానికి రాకపోవడంతో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయి. ఇన్‌చార్జ్ తహసీల్దారుగా పని చేయడం తనకు ఇష్టంలేదని, తన వల్ల కాదని బాహాటంగా చెబుతున్నారు. దీంతో సిబ్బంది సైతం విధులను అంతంతమాత్రంగానే నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలో అవినీతి పెరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. భూములు కొనుగోలు చేసిన రైతులు ఈ పాసుపుస్తకాల కోసం రెండు, మూడుసార్లు డబ్బులు వెచ్చించి మీసేవలో దరఖాస్తు చేసుకుని తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ముఖ్యంగా భూసమస్యలు ఎక్కువగా ఉండడంతో వాటిని పరిష్కరించవలసిన తహసీల్దారు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు పాలనలో మండల ప్రజలు విసుగు చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టరు స్పందించి నూతన తహసీల్దారును నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



దీప

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఉగ్గుమూడి దీప ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థినిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏర్పేడు పంచాయతీకి రూ.38లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

ఏర్పేడు: స్థానిక పంచాయతీకి వాణిజ్య సముదాయాలు, సంతమైదానం, కూరగాయల మార్కెట్ వేలం ద్వారా రూ.38,46,012 ఆదాయం లభ్యమైంది. గురువారం ఏర్పేడు సచివాలయంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, ఎంపీడీఓ గిడ్డయ్య ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్, సంత, 18 గదులకు వేలం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వేలంలో ఓ ఏడాదికి వీటిని దక్కించుకున్నారు. ఈఓపీఆర్డీ మురగయ్య, హౌసింగ్ ఏఈ అమరనాథ్, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి, వేలందారులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ బాటలో నడవాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, సీపీఎం నేతలు

కేవీబీపురం: విప్లవ వీరుడు భగత్‌సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు భగత్‌సింగ్‌కు నివాళులు అర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శపాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ ముష్కరులకు ముచ్చెమటలు పట్టించిన ధీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. దేశం కోసం అతి పిన్న వయసులో ఉరికంభం ఎక్కి ప్రాణత్యాగం చేసిన గొప్ప భారతీయుడన్నారు. నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని నడవాలని కోరారు.

తాగునీటి కోసం అవస్థలు



ట్యాంక్ వద్ద తాగునీరు పట్టుకెళ్తున్న మహిళలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తాటిపర్తి పంచాయతీలోని మల్లిగుంట దళితవాడలో 100 కుటుంబాలు వరకు నివాసం ఉంటున్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో గత పది రోజులుగా తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్నామని వాపోతున్నారు. అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నామని, అయినా తమ బాధను పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ఇరుగుళం, మాధనపాళెం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న టీచర్లు

సత్యవేడు: శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఇరుగుళం, మాధనపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాయడానికి ఒక్కో విద్యార్థికి ఒక రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీ బాక్సులను ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. అలాగే ఇరుగుళం స్కూల్లో 57 మంది, మాధనపాళెంలో 20 మంది విద్యార్థులకు శ్రీసిటీలోని రాక్ వర్త్ కంపెనీ అందజేసిన పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం శ్రీసిటీ ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

వీకేపాళ్యంలో సీసీ రోడ్డు పూర్తి



వీకే పాళ్యం దళితవాడలో నిర్మాణంలో సీసీ రోడ్డు పనులు

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 30 ఏళ్ల కల నెరవేరిందని వీకేపాళ్యం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వీకే పాళ్యం దళితవాడలో రూ.8 లక్షలతో గురువారం సీసీ రోడ్డు పనులను పూర్తి చేశారు. మూడు దశాబ్దాల కల నెరవేరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు రోడ్డు దుస్థితిని విన్నవించారు. స్పందించిన ఆయన సచివాలయ నిధులతో సీసీ రోడ్డు వేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా వీకే పాళ్యం సచివాలయ కన్వీనర్ గోపాల్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా తెలుగుదేశం మద్దతు సర్పంచ్‌లు రోడ్డును పూర్తిగా విస్మరించారని అన్నారు. పలుమార్లు నిరసనలు, ధర్నాలు చేసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. అయితే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు రుణపడి ఉన్నామన్నారు.

విరించి-2కే23 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ రజని, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 11, 12వ తేదీల్లో విరించి-2కే23 పేరుతో జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్, టీజర్, బ్రోచర్, వెబ్‌సైట్‌ను గురువారం ఇన్‌చార్జ్ వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రజని, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పి.మల్లికార్జున, అధ్యాపకులు, విద్యార్థులు ఆవిష్కరించారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



బీఎన్‌కండ్రిగలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నపిల్లలకు పోషకాహారం అందించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా రక్తహీనత దూరం అవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల రత్నమ్మ, శిల్ప తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగలో ర్యాలీ నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, పిల్లలంతా పౌష్టికాహారం తింటే వయసుకు తగ్గ పోషకాలను అందుతాయని, ఎత్తు, బరువు సమానంగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వృథా చేయకుండా తినాలన్నారు. ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. పోషణ మేళా, సీబీ ఈవెంట్స్, చిరుధాన్యాలు, డైట్, గృహసందర్శన గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాయల సిబ్బంది వెంకటసుబ్బయ్య, మునికుమార్, కార్యకర్తలు ప్రమీలమ్మ, సుదర్శనదేవి, యమున పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయలక్ష్మి

సత్యవేడు: పంచాయతీల్లో జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాలను సమగ్రంగా నిర్వహించి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జెడ్పీటీసీ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె సత్యవేడు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) వద్ద మండల అధికారులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, సచివాలయ కార్యదర్శులతో జగనన్న స్వచ్ఛసంకల్పం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 28 వరకు జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అలాగే మండలంలోని మఠం, మిద్దె కండ్రిగ, బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కొత్తపాళెం, బుచ్చినాయుడుకండ్రిగలో జరిగిన ఇదే కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపసర్పంచులు, పశువైద్యశాఖసిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, క్లాప్ మిత్రలు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ బాలగణేశ్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తయారవుతున్న సేంద్రియ ఎరువును కేజీ రూ.10 నుంచి 15కు విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆర్థికాభివృద్ధి పొందవచ్చన్నారు. రాబోయే తరాలకు మంచి ఆరోగ్యం ఇవ్వాలంటే సేంద్రియ ఎరువులు వాడకం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో జగనన్న స్వచ్ఛసంకల్పం జిల్లా రిసోర్సు పర్సన్ రవికుమార్, సర్పంచ్‌లు మంజుల, రమేష్, నాయకులు మాస్టర్‌స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ముని రవికుమార్, సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి



షుగర్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, రైతులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో మూతపడిన వెంకటేశ్వరా సహకార షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం వెంటనే తెరిపించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రైతులు, కార్మికులు కర్మాగారం ఎదుట ఆందోళన చేశారు. సీపీఎం నాయకులతో కలిసి ధర్నా చేశారు. రైతులకు ఇవ్వాల్సిన చెరకు బకాయిలను ఇచ్చి ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఫ్యాక్టరీని నమ్ముకున్న కార్మికులు జీవనోపాధి కోల్పోయి దుర్భర జీవితాలను గడుపుతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు.

గ్రంథాలయాలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న చైర్మన్ మధుబాల

తిరుపతి అర్బన్: పాఠకులు కోరినట్లుగా వారికి విద్యార్థులకు ఉపయోగకరమైన పుస్తకాలను రూ.71,563లతో కొనుగోలు చేసినట్లు గ్రంథాలయాల జిల్లా చైర్మన్ మధుబాల పేర్కొన్నారు. ఆమె గురువారం కొత్తగా కొనుగోలు చేసిన పుస్తకాలను తిరుపతిలోని గ్రేడ్-1 గ్రంథాలయం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంంంథాలయాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లావణ్య, ఉద్యోగులు శివప్రసాద్, గజేంద్ర బాబు, ధనుంజయులు, మునీంద్ర, మురళి, గోవిందరాజులు, జీవన్‌సాయి పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక



జిల్లా డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ వజీర్‌బాషా, కార్యదర్శిగా సోంపల్లి శేఖర్‌నాయుడు ఎంపికయ్యారు. తిరుపతిలోని ఒక ప్రైవేట్ హోటల్లో గురువారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడుగా కోలా మురళి, సంయుక్త కార్యదర్శిగా గొర్రిపాటిమోహన్, కోశాధికారిగా రెహమాన్ రవతార్ ఫాజుల్, 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవడంతోపాటు ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. గంధమనేని శివయ్యభవన్‌లో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆధునిక సమైక్య భారతదేశాన్ని నిర్మించుకునే కృషికి బీజం వేసిన వాడు భగత్‌సింగ్ అని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ఆకలి లేని సమాజాన్ని నిర్మించేందుకు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వనాథ్, రాధాక్రిష్ణ, కుమార్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నేతలు బండి చలపతి, ఉదయ్, సురేష్, ప్రవీణ్, యూత్ ఫెడరేషన్ నేత నాగరాజు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచి సమాజ సేవ చేయాలి



మాట్లాడుతున్న వెటర్నరీ వర్సిటీ డీన్ రమణ

తిరుపతి రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు సామాజిక సేవ కూడా చేయాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ జేవీ రమణ పేర్కొన్నారు. ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలో వారం రోజులు చేపట్టిన ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు పల్లెలకు వచ్చి అక్కడి సమస్యలను స్వయంగా గుర్తించి, పరిష్కరించేందుకు ప్రయత్నించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై అధిక దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వసుంధర, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ రెడ్డికుమార్ పాల్గొన్నారు.

